క్లుప్తంగా

రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



రమేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పటేల్ రమేశ్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో కలిసిన నాయకులు శాలువతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా పర్యాటక రంగాభివృద్ధికి చొరవ చూపాలని కోరారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మావల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు నవీన్‌రెడ్డి, సురేశ్, రంజిత్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబీకులతో ఆత్రం సుగుణ

ఇంద్రవెల్లి: మాజీ ఎంపీ సోయం బాపురావ్ చెల్లెలు పెందోర్ భుంబాయి అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ.. మండలంలోని దేవాపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబీకులను మంగళవారం పరామర్శించారు. భుంబాయి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు రాధాబాయి, గాజుల సుగుణ తదితరులు ఉన్నారు.

నవేగావ్‌లో వైద్యశిబిరం



రోగులకు పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ సాగర్

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్‌లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 56 మంది రోగులకు వైద్యుడు సాగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వైద్యుడు గ్రామస్తులకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఇంద్రవెల్లి: స్థానిక రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఎరువులు, మందుల పిచికారీ తదితర వాటిపై శాస్త్రవేత్తలు శ్రీదేవి, శ్రీనివాస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు, సూచనలు చేశారు. సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏవోలు రాథోడ్ గణేశ్, అరుణ, ఏఈవోలు మల్లేశ్, వీర, వివేక్, నవతేజ్, కరుణ, రైతులు గోపినాథ్, చందర్‌సింగ్, నిధ్యాన్‌సింగ్, చంద్రకాంత్ ఉన్నారు.

నేడు విఠలేశ్వరుని కల్యాణం



విఠల్ రుక్మిణీ దేవతామూర్తులు

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని శ్రీ విఠలేశ్వరుని కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కొలువుదీరిన రుక్మిణీ సమేతుడైన విఠలేశ్వరున్ని నూతన వస్త్రాలతో అలంకరించనున్నారు. ఈ మేరకు ఆలయం ముస్తాబైంది.

స్కూల్ బ్యాగులు పంపిణీ

జైనథ్: మండలంలోని బెల్లూరిగూడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎస్సై పురుషోత్తం మంగళవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులతో కలిసి పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

చేలకు బురద దారే!

- కరత్వాడ ఎడమ కాలువ గుండా వెళ్లే మార్గం అధ్వానం
- వర్షాలు కురిస్తే అంతే సంగతి
- అవస్థలు పడుతున్న రైతులు



బురదమయంగా మారిన దారి

బోథ్: రైతులు తమ చేలల్లోకి వెళ్లేదారి బురద ఉండడంతో అవస్థలు పడుతున్నారు. బోథ్ పెద్ద వాగు నుంచి జీడిపల్లెకు వెళ్లేదారిలో కరత్వాడ ఎడమ కాలువ ఆనుకుని మట్టి దారి ఉంది. కాలువ వెంబడి నడిచి.. చేలకు చేరుకుంటారు. వర్షాలు కురిస్తే దారి బురదమయం అవుతోంది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. అయినా బురద దారిలో నడుస్తూ వ్యవసాయం చేస్తున్నారు. పంట ఉత్పత్తులు అమ్మడానికి, విక్రయించేందుకు పడరాని పాట్లు ఎదుర్కొంటున్నారు.

3 కి.మీ బురదలో నడవాల్సిందే..

కరత్వాడ ఎడమ కాలువని ఆనుకుని వందల ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. ప్రతీరోజు కాలువ వెంబడి చేలల్లోకి చేరుకుంటున్నారు. వర్షాకాలంలో బురదమయంగా మారే ఆ దారిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీడిపల్లె నుంచి బోథ్ రహదారి మీదుగా చేలకు చేరుకోవాలంటే 3 కి.మీ మేర బురదలో నడవాల్సిన పరిస్థితి. ఈ దారిలో రెండు వంతెనలు ఉన్నాయి. వర్షాకాలంలో లోలెవల్ వంతెనలపై నుంచి వరదనీరు ప్రవహించడంతో చేలల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఓ వంతెన ఇటీవల కూలడంతో అటువైపు వెళ్లలేకపోతున్నారు. సరైన రోడ్డు లేక వ్యవసాయం చేయడం కష్టంగా మారిందని పేర్కొంటున్నారు. ఇక వాగు వస్తే దాటలేని పరిస్థితి నెలకొంది. ఇక పండించిన పంటలను ఇంటికి, లేదా మార్కెట్‌కు తీసుకురావాలంటే రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎడ్లబండి కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు.

లింకు రోడ్డు నిర్మిస్తే మేలు..

కెనాల్ పక్కనుంచి గల దారి నుంచి కనుగుట్ట లింకు రోడ్డు నిర్మిస్తే తమ కష్టాలు దూరమవుతాయని రైతులు పేర్కొంటున్నారు. రోడ్డు నిర్మించాలని కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పట్టించుకుని రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



చేలల్లోకి వెళ్లేదారి ఇదే..



చేలకు వెళ్లేదారిలో కూలిన వంతెన (ఫైల్)

కష్టంగా ఉంది



నాకు 16 ఎకరాల భూమి ఉంది. పత్తి, సోయాతోపాటు వివిధ పంటలు సాగు చేస్తున్నా. చేనుకు రావడానికి దారి బురదగా ఉంది. అధిక వర్షాలు కురిస్తే యూరియా బస్తాలను చేలకు తీసుకురాలేకపోతున్నాం. పంటలు పండించాక ఇంటికి, మార్కెట్‌కు తీసుకురావడం కష్టంగా ఉంది. ప్రభుత్వం వెంటనే రోడ్డు నిర్మించాలి.

– నరంశెట్టి శంకర్, రైతు

లింకు రోడ్డు నిర్మించాలి



ఆర్మీలో ఉద్యోగం చేసి పదవీవిరమణ పొందా. తర్వాత 8 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. బురద దారి గుండా చేనులోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వంతెన నిర్మాణంతో పాటు కెనాల్‌ను ఆనుకుని కనుగుట్ట వరకు లింకు రోడ్డు నిర్మించాలి.

– మల్లెపూల మహేందర్, రైతు

బొమ్మలతో బోధన



చార్టులు పరిశీలిస్తున్న విద్యార్థినులు

- జామ్‌డా సైన్స్ మోడల్ ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు
- సులభ పద్ధతిలో ఆంగ్లం నేర్చుకునేలా..
- విద్యార్థినుల కోసం చార్టులు, వర్కింగ్ మోడల్స్

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు ఆంగ్లంపై పట్టు సాధించేలా ఓ ఉపాధ్యాయుడి వినూత్న ప్రయత్నం చేస్తున్నాడు. మండలంలోని జామ్‌డా గ్రామంలోని సైన్స్ మోడల్ ఆశ్రమ ఉన్నత పాఠశాల(బాలికలు) ఉపాధ్యాయుడు ఆడే కైలాస్.. ఆంగ్లం పాఠ్యాంశంలోని అంశాలను కీలకమైన బొమ్మలతో ఆకర్షణీయంగా కాలమానిని రూపొందించారు. వాటిని ఒక గదిలో ఇంగ్లిష్ ల్యాబ్ పేరుతో ఏర్పాటు చేసి విద్యార్థినులకు సులభంగా అర్థమయ్యేలా అమర్చారు. ఇంగ్లిష్ గ్రామర్‌ను వారు సులభంగా అర్థం చేసుకొని నేర్చుకునేలా ×వర్కింగ్ మోడల్స్‌*పేరుతో తయారు చేశారు. ప్రతీరోజు వారికి కేటాయించిన పీరియడ్‌లో ఇంగ్లిష్ ల్యాబ్‌కి వెళ్లి నేర్చుకొని ఎన్నో విషయాలను తెలుసుకుని ఆంగ్లంపై విజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. ఈ అంశాలు పరీక్షల్లో మార్కులు సాధించేలా ఉన్నాయని విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంగ్లిష్ ల్యాబ్‌లో..

టెన్సెస్ చాట్, స్పార్ట్ షాప్ స్పీచ్ వర్కింగ్ మోడల్, డిగ్రీస్ ఆఫ్ కంపారిజన్, ఆర్టికల్ ప్రిపొజిషన్, వరల్డ్ గేమ్స్, లెటర్ విత్ సింబల్స్, వర్డ్ పజిల్స్, చిన్నచిన్న రాళ్లతో వర్డ్ తయారు చేయడం వంటి ఎన్నో అంశాలు ఉన్నాయి. 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు అర్థమయ్యేలా ఇంగ్లిష్ ల్యాబ్‌లో ఏర్పాటు చేశారు.



నేలపై ఏర్పాటు చేసిన వర్డ్ గేమ్

పోటీ పరీక్షల్లో రాణించేలా..



పోటీ పరీక్షలో రాణించేలా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ప్రతి సబ్జెక్టుకు ఒక ల్యాబ్ ఏర్పాటు చేసి వారికి సులభ పద్ధతిలో అర్థమయ్యేలా విద్యాబోధనలు చేస్తున్నా. ఆంగ్లం అధ్యాపకుడు అడే కైలాస్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన అంశాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– చౌహాన్ నెహ్రూ, హెచ్‌ఎం

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

నేరడిగొండ: రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్‌సింగ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ కోసం రేషన్ కార్డు చూడటమేంటని ప్రశ్నించారు. పాస్‌బుక్ ఉన్న ప్రతీ రైతుకు రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, రాఘవులు, ప్రవీణ్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

రేషన్ కార్డు నిబంధన తొలగించాలి

తలమడుగు: రుణమాఫీకి తెల్ల రేషన్‌కార్డు నిబంధన తొలగించాలని మండల రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఈ నిబంధన తొలగించాలని కోరారు. లేకపోతే రైతుల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. రైతులు పద్మాకర్‌రెడ్డి, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.



తలమడుగు: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ముదిరాజ్‌లను బీసీ ‘ఏ’లో చేర్చాలి

నేరడిగొండ: ముదిరాజ్‌లను బీసీ‘ఏ’లో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ సంఘ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఆయన్ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించాలని కోరారు. గతంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి ఇచ్చిన జీఓ నం.17 యదావిధిగా అమలయ్యేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్సీ పదవులతోపాటు ఒక రాజ్యసభ పదవి, పది కార్పొరేషన్ పదవులు కట్టబెట్టేలా చూడాలని విన్నవించారు. అంతకుముందు తహసీల్దార్ సంతోష్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ, ప్రధాన కార్యదర్శి సలేందర్ శివయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, మండల మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, రవీందర్, శ్రీకాంత్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

‘తులం బంగారం హామీ ఏమైంది?’

నేరడిగొండ: ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీ ఏమైందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రశ్నించారు. ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి ఇప్పటికి తులం బంగారం ఇవ్వలేదని విమర్శించారు. మండల కేంద్రంలోని తన నివాసంలో బోథ్ నియోజకవర్గంలోని 123 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.25లక్షల 9వేల చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. తాజామాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్‌ఎస్ మండలాల కన్వీనర్లు అల్లూరి శివారెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, రాజారాం, తోట వెంకటేశ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

భారీ వర్షం



ఇచ్చోడ: రోడ్లపై పారుతున్న వర్షపు నీరు



ఇంద్రవెల్లిలో కురుస్తున్న వర్షం

ఇచ్చోడ/ఇంద్రవెల్లి: ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఇచ్చోడలోని అంబేద్కర్ చౌక్, శివాజీచౌక్‌లో వర్షపునీరు రోడ్లపై చేరడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. అదే విధంగా ఇంద్రవెల్లి మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో వాగులు పొంగిపొర్లాయి. మామిడిగూడ, జైత్రంతాండ, చిత్తబట్ట, జెండగూడ గ్రామాలకు రాకపోకలు అంతరాయం కలిగింది. పొల్లుగూడ, ఖైర్‌గూడ, గోపాల్‌పూర్ గ్రామాల్లో మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మొహర్రం సందడి



ఉట్నూర్‌రూరల్: యువకుల నృత్యాలు

నేరడిగొండ: మొహర్రం ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. మండలంలోని బుగ్గారం(బి), వడూర్, వాంకిడి, తేజాపూర్, కుమారి, తర్నం, వాగ్దారి, వెంకటాపూర్, కుంటాల తదితర గ్రామాల్లో మంగళవారం పీరీలను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి వేళల్లో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ సందడి చేశారు.



బుగ్గారం(బి)లో పీరీలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్‌లో పీరీల వద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు నృత్యాలు చేశారు. 11 రోజుల పాటు జరిగే పీరీల ఉత్సవాలను గురువారంతో ముగిసన్నాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ, బక్కన్న, సత్యం, అశోక్, దత్త, చాంద్‌రావు, నరేశ్, రవీందర్, నర్సయ్య, నవీన్ కుమార్, సదాశివ్, రాజు పాల్గొన్నారు.

పీరీల ఉరేగింపు

జైనథ్: పీరీలను మతసామరస్యానికి ప్రతీకగా చెబుతుంటారు. జైనథ్‌లో మాత్రం ఏళ్లుగా నిమ్న కులాలకు చెందిన వ్యక్తులు పీరీలు ఎత్తుకోవద్దనే దురాచారం కొనసాగుతూ వస్తోంది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఇటీవల యువకులు పెద్దలతో గ్రామపంచాయతీలో సమావేశం ఏర్పాటు చేసి తమకు పీరీలు ఎత్తుకోవడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దిగివచ్చిన గ్రామస్తులు ఏళ్ల నాటి దురాచారాన్ని రద్దు చేస్తూ తీర్మానం చేశారు. మంగళవారం ఉదయం కులమత భేదం లేకుండా పీరీలు ఎత్తుకున్నారు. ఏళ్లుగా కొనసాగుతున్న వివక్షకు తెరపడింది. యువకులు భక్తిశ్రద్ధలతో పీరీలు ఎత్తుకొని ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు.



పీరీలను ఊరేగిస్తున్న యువకులు

బాజీరావు బాబా పల్లకీ ఊరేగింపు

బేల: ఈనెల 21న మహారాష్ట్రలోని సుక్నేగావ్‌లో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా శిష్యులు మంగళవారం మండలంలోని కాంఘర్‌పూర్ నుంచి పాదయాత్రగా పల్లకీతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏఎస్సై జీవన్‌కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీ పాదయాత్రను ప్రారంభించారు. ఐదు రోజుల పాటు ఆయా గ్రామాల మీదుగా వెళ్లి గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొననున్నారు. ప్రధాన శిష్యులు ఠాక్రే గంభీర్, రావుత్ విఠల్, ఠాక్రే మధుకర్, డాలే ప్రభాకర్, చర్డే నానాజీ, వడ్కే సురేష్., డాలే అతుల్ పాల్గొన్నారు.



పల్లకీ ఊరేగిస్తున్న భక్తులు

గోదాంలు సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: రైతులు తమ పంటలను నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం గోదాంలను ఏర్పాటు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ ప్రోగ్రాం డైరెక్టర్ శ్యామ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు పంట నిల్వచేసుకునే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీసీవో మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ ధనుంజయ్, డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, అశోక్ ఉన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన అమలు చేయాలి

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం డివిజన్ అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్ అన్నారు. మండలంలో మంగళవారం ఆ సంఘ నాయకులతో ఏర్పాటు చేసిన చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు పుండలిక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బాట ర్యాలీ



అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల ర్యాలీ

బేల: అమ్మబాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమన్నారు. పాఠశాలల్లో చేరే నాటికి అక్షరాలు, అంకెలు నేర్పి ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు విశాఖ, పద్మ, సునీత, వందన, మంగళ, అనిత తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లు అప్పగింత



బాధితులకు ఫోన్‌లు అందజేస్తున్న సీఐ

ఎదులాపురం: తలమడుగు మండలం సాయిలింగికి చెందిన ముగిగెల పవన్, పట్టణానికి చెందిన పెంద్రం హేమంత్ రిమ్స్ ప్రాంతంలో ఈనెలలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. బాధితులు ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఐఎంఈఐ ఆధారంగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా రెండు మొబైల్‌లను ట్రేస్ చేశారు. సీఐ కరుణాకర్‌రావు మంగళవారం బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించారు. కానిస్టేబుల్ నరేశ్, సంజు, క్రాంతి, నరేందర్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



అనుప్రియ

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన ఇప్ప అనుప్రియ బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికైంది. ఇటీవల టెన్త్ ఫలితాల్లో 9.7 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. బాసర ట్రిపుల్‌ఐటీ సోమవారం విడుదలైన ఫలితాల్లో ఆమె ఎంపికై ంది. తల్లిదండ్రులు చందు, కుసుమ సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు అనుప్రియను అభినందించారు.